## క్లుప్తంగా

### కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా మధుకర్



నియామకపత్రం ఇస్తూ...

చెన్నూర్: చెన్నూర్ కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా మద్ద మధుకర్‌ను నియమించినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆదేశాల మేరకు రైతు బిడ్డా మద్ద మధుకర్‌ను కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు వెంకట నర్సయ్య, తుమ్మ శ్రీపాల్, బత్తుల సమ్మయ్య, కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్, కేవీఎం శ్రీనివాస్, పట్టణ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణరెడ్డి, శంకర్, రాజబాపు పాల్గొన్నారు.

### పశువులకు లంపీస్కిన్ వ్యాధి



వ్యాధితో బాధపడుతున్న లేగదూడ

భీమారం: మండలంలోని పోతన్‌పల్లి గ్రామంలో పది రోజులుగా పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకి తీవ్ర అస్వస్థతకి గురవుతున్నాయి. రెండేళ్ల క్రితం కూడా ఇదేవ్యాధి సోకి పదుల సంఖ్యలో పశువులు మృతి చెందాయి. తిరిగి ఈ సారి కూడా పశువులతో లేగదూడలకు కూడా లంపీస్కిన్ అనే చర్మ వ్యాధి వ్యాప్తించింది. దీంతో శరీరంపై దద్దుర్లు వచ్చి, పురుగులు పడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. శరీరంలో మొదట కొన్నిచోట్లకే పరిమితమై, చివరకు అంతా వ్యాప్తించి మృతి చెందుతున్నాయని వారు తెలిపారు. గ్రామానికి చెందిన ఎడ్ల నారాయణకి చెందిన పశువులకు బుధవారం వ్యాధిసోకి చావుబతుకుల మధ్య ఉన్నాయి. పశువైద్యాధికారులు చర్యలు తీసుకొని లంపీస్కిన్ వ్యాధి నివారణ కోసం గ్రామంలో పశువైద్యశిబిరం ఏర్పాటు చేయాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

### 30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

దండేపల్లి: అక్టోబర్‌లో జరిగే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు సంబంధించి, పరీక్ష ఫీజును ఈ నెల 30లోగా చెల్లించాలని దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శంకర్‌గౌడ్, సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. ఐదేళ్లలోపు ప్రవేశం పొంది పరీక్ష రాయనివారు, పరీక్షలు ఫెయిల్ అయిన వారు కూడా పరీక్ష ఫీజు చెల్లించి, పరీక్షలు రాయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్:83097 69067 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

### వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) 18వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మందమర్రి మండలం పులిమడుగు గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ నాయకులు పెద్దపెల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పడిన వీహెచ్‌పీఎస్ వికలాంగుల అనేక హక్కులను సాధించిందన్నారు. వికలాంగుల పెన్షన్ రూ.6వేల పెంపునకు భవిష్యత్‌లో మరొక ఉద్యమానికి శ్రీకారం చుడుతామని పేర్కొన్నారు. నాయకులు ఇందూరి రమేష్, బండోజు నరేష్, రాజు, రవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

చెన్నూర్/భీమారం: చెన్నూర్ నియోజకవర్గంలో గురువారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నారు. ఉదయం 6:30గంటలకు ఊరు మందమర్రిలో వార్డులలో పర్యటన, 9:30 గంటలకు భీమారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భూమిపూజ, 19:30గంటలకు చెన్నూర్‌లో బస్తీ దవాఖానా భవన భూమిపూజ, 11:30గంటలకు జైపూర్ మండలంలోని వేలాలలో సబ్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయా మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

# కొత్త కాలనీల్లో సమస్యల తిష్ట

- గద్దెరాగిడి ప్రాంతంలో పెరుగుతున్న నివాస గృహాలు
- పన్నులు వసూలు చేస్తున్నా.. వసతుల కల్పనపై దృష్టి సారించని వైనం
- రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలకు అవస్థలు
- రోడ్లపై నిలుస్తున్న మురుగుతో రోగాల ముప్పు



గద్దెరాగిడిలో డ్రెయినేజీ లేక ఖాళీ ప్లాట్లలో నిలిచిన మురుగునీరు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఐదారు ఏళ్లుగా పదుల సంఖ్యలో కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. 2018లో మున్సిపాలిటీగా ఏర్పడ్డ నాటి నుంచి పెరిగిన పన్నునే ఇక్కడ అధికారులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ కొత్తగా ఏర్పడిన కాలనీల ఇంటి యజమానుల నుంచి కూడా పన్నులు వసూలు చేస్తున్నారు. అయితే ఈ ఐదారు సంవత్సరాల నుంచి ఎక్కడా కూడా రోడ్లు, డ్రెయినేజీలు కట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పన్నుల వసూళ్లలో ఉన్న శ్రద్ధ మౌలిక వసతుల కల్పనపై కూడా చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

**వివరాల్లోకి వెళ్తే..**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి ప్రాంతం ఇటీవల కాలంలో శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. మంచిర్యాల జిల్లా కేంద్రానికి కొద్ది దూరంలోనే ఈ ప్రాంతం ఉండటంతో పాటు మంచిర్యాల–నాగ్‌పూర్ జాతీయ రహదారికి ఆనుకునే ఉండటంతో ఇక్కడ పెద్ద ఎత్తున ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టారు. అయితే గద్దెరాగిడి ప్రాంతంలో పదుల సంఖ్యలో ఏర్పడ్డ కొత్త కాలనీలకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గణేష్‌నగర్, సాయికుటీర్, మారుతీనగర్, భరత్‌నగర్, పద్మావతి కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, జీఎంఆర్ టౌన్‌షిప్ తదితర ప్రాంతాల్లో సమస్య మరీ తీవ్రంగా ఉంది. రోడ్లతో పాటు ఏ ఒక్క కాలనీకి కూడా సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మధ్యనే మురుగునీరు నిలుస్తూ అస్తవ్యస్తంగా మారుతోంది.



రోడ్లు, డ్రెయినేజీ లేక అస్తవ్యస్తంగా ఉన్న కాలనీలు

**చినుకుపడితే నడవలేని స్థితి..**

గద్దెరాగిడి ప్రాంతంలోని కొత్తగా ఏర్పడిన కాలనీలలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంటున్నాయి. చినుకు పడిందంటే రోడ్లపై నడవలేని పరిస్థితి. కాలనీల్లో రోడ్లు నిర్మించాలని కొంత కాలంగా అధికారులకు విన్నవించినా, కనీసం పట్టించుకోవటం లేదని అంటున్నారు. ఇంటి పన్నుల వసూళ్లపై చూపిన శ్రద్ధ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలపై కూడా చూపాలని కోరుతున్నారు.

**దశలవారీగా నిర్మాణం**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలను దశలవారీగా చేపడుతాం. ఇప్పటికే ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2కోట్ల 30లక్షలతో పలు కాలనీలలో రోడ్ల నిర్మాణపు పనులు ప్రారంభించాం. త్వరలోనే అన్ని కాలనీలకు రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తాం.

- మురళీకృష్ణ, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్

# గ్రామాల్లో వైద్య శిబిరాలు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి, గురిజాల గ్రామాల్లో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామీణులకు రోగ నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. అనంతరం మందులు అందజేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామీణులు పాల్గొన్నారు.

**కోటపల్లిలో ఆయుష్ వైద్యశిబిరం**

కోటపల్లి: మంచిర్యాల జిల్లాలో కొన్ని నెలలుగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయుష్ వైద్య శిబిరాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆయుష్ దవాఖానాలో వైద్య శిబిరం నిర్వహించారు. 50సంవత్సరాలు పైబడిన వృద్ధులకు శిబిరంలో వైద్య పరీక్షలు చేసుకోగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ ప్రోగ్రాం అధికారి రవీందర్, ఆయుష్ సిబ్బంది శ్రీనివాస్, శాబీర్ బేగం, నర్సయ్య, ముష్తార్ పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

# అభివృద్ధి పథంలో యూనివర్సల్ బ్యాంక్

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల పట్టణంలోని యూనివర్సల్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 46వ సర్వసభ్య సమావేశాన్ని పట్టణంలోని వైశ్యభవనంలో బుధవారం బ్యాంకు చైర్మన్ వి.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకుకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.76.35లక్షల నికర లాభం వచ్చిందని తెలిపారు. వాటా దారులకు 11శాతం డివిడెండ్ ప్రకటించారు. మంచిర్యాల, సీసీసీలలో ఏటీఎం సౌకర్యం కల్పించామని, సీనియర్ సిటిజన్స్‌కు ఇతర బ్యాంకుల కన్నా డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఇస్తూ, సీనియర్ సిటిజన్స్ బ్యాంకుకు రాలేని పక్షంలో వారికి ఇంటికి వెళ్లి సర్వీస్ చేస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా సహకార శాఖ అధికారి బి.సంజీవ రెడ్డి బ్యాంకు సాధించిన ప్రగతిని ప్రశంసిస్తూ ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలందించాలని తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంకు ఇన్‌చార్జి, సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి, బ్యాంకు వైస్ చైర్మన్ జీ. పూర్ణచంద్ర రావు, డైరెక్టర్లు కేఎస్ఎం రావు, జీ కృష్ణ మూర్తి, జే శ్రీదేవి, కే. బక్కయ్య, ఆర్. ప్రసాద్ రావు, జీ.రాజలింగు, బి.భాను ప్రకాశ్, కే.రత్నం, కే.సుశీల, ఎస్ భాగ్యలక్ష్మి, ఐపీఎస్ఎస్ ఆదిత్య, శ్రీపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంజీవ రెడ్డి

# ముగిసిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి పునరావాస కాలనీలో నిర్వహిస్తున్న శ్రీఅభయాంజనేయ శివపంచాయతన సహిత నవగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. వేదపండితులు రాఘవేంద్రశర్మ, బాలాజీశర్మ, సాంబశివశర్మ బృందం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీఅభయాంజనేయ శివపంచాయతన సహిత నవగ్రహాలను దర్శించుకొని తీర్థ, అన్నప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు కూ డా ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.



విగ్రహ ప్రతిష్ఠలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

### పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతకాని సంఘ నాయకులు

జన్నారం: నేతకాని కులస్తులు వైభవంగా జరుపుకొనే పొలాల అమావాస్య ఎడ్ల పొలాల పండుగ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీఎస్టీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ మాట్లాడారు. నేతకాని సామాజికవర్గం అత్యంత వైభవంగా జరుపుకొనే పండుగను ఊట్నూర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జన్నారం మండలంలో అత్యధిక జనాభా కలిగిన నేతకాని సామాజికవర్గం పొలాల పండుగ ఏర్పాట్లు చేసుకొని భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం వెంకటేశ్‌నేత, నాయకులు బోర్లకుంట దుర్గయ్య, కొత్తపల్లి గంగేశ్, చంద్రపాల్ పాల్గొన్నారు.

### అధికారులకు సన్మానం



మేనేజర్‌ను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

శ్రీరాంపూర్: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏరియాల్లో బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులను సన్మానించారు. ఆర్కే 7 గని మేనేజర్ జీ.తిరుపతి, సేఫ్టీ ఆఫీసర్ జగదీష్‌లను బుధవారం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ఇన్‌చార్జి రౌతు సత్యనారాయణ, అండర్ మేనేజర్లు కొత్తపల్లి రవీందర్, ఇంజనీర్ తోట రమేశ్, మైనింగ్ సిబ్బంది నాగరాజు, చంద్రశేఖర్, శ్రీనివాస్‌తో పాటు నాయకులు మధుకర్, జగదీష్, పాదం శ్రీనివాస్, బొలిశెట్టి శ్రీకాంత్, బద్రి శ్రావణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కుటుంబాల నిర్ధారణ నమోదు ప్రారంభం

దండేపల్లి: రేషన్‌కార్డు లేని రైతులకు రుణమాఫీ వర్తించేలా, కుటుంబాల వారీగా నిర్ధారణ చేయాలని ప్రభుత్వం సూచించింది. రూ.2 లక్షల పంట రుణం పొంది రేషన్‌కార్డు లేక రుణమాఫీ కానీ కుటుంబాల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. దండేపల్లి మండలంలోని ఆయా వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో ఏఈవోలు రైతు వేదికల వద్ద బుధవారం కుటుంబ నిర్ధారణ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. రేషన్‌కార్డు లేక రుణమాఫీ కాని వారి వివరాలు తీసుకొని, ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. మండలంలో 860మందికి గాను మొదటి రోజు 80మంది రైతుల వివరాలు యాప్‌లో నమోదు చేసినట్లు ఏవో అంజిత్‌కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియను వారంలోగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయా క్లస్టర్ల ఏఈవోలు వివరాలు నమోదు చేస్తూ, రైతుల నుంచి స్వీయ ధ్రువీకరణ తీసుకుంటున్నారు.

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లిలో పంట రుణమాఫీ పథకంలో భాగంగా కుటుంబ నిర్ధారణ లేని రైతుల వివరాలను బుధవారం మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో నమోదు చేసుకున్నారు. రైతుల వివరాలను రుణమాఫీ యాప్‌లో కుటుంబ నిర్ధారణ లేని రైతుల కుటుంబాల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలో 348మంది రైతులు, దేవాపూర్ యూనియన్ బ్యాంకు పరిధిలో 100మంది కుటుంబ నిర్ధారణ లేని రైతులు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.



దండేపల్లిలో వివరాలు నమోదు చేస్తున్న ఏఈవోలు

**నేటి నుంచి బెల్లంపల్లి మండలంలో..**

బెల్లంపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ ధృవీకరణ సర్వే గురువారం నుంచి మండల పరిధిలోని గ్రామాల్లో చేపట్టనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎస్. ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ నెల 29వ తేదీన అంకుశం, 30వ తేదీన ఆకెనపల్లి, 31వ తేదీన చంద్రవెల్లి, సెప్టెంబర్ 2వ తేదీన పెర్కపల్లి, 3వ తేదీన కన్నాల, 4వ తేదీన బట్వాన్‌పల్లి, 5వ తేదీన బుధాకుర్దు, 6వ తేదీన దుగ్నెపల్లి, 7వ తేదీన చాకేపల్లి, 9వ తేదీన రంగపేట, 11వ తేదీన గురిజాల గ్రామ పంచాయతీల్లో రైతుల ధృవీకరణ సర్వే చేపట్టనున్నారు. రుణమాఫీ కాని రైతులు తమ కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులు, బ్యాంక్ పుస్తకం జిరాక్స్, రైతు రుణమాఫీ పత్రాలతో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారులను సంప్రందించాలని తెలిపారు. రుణమాఫీ కాని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.



ముత్యంపల్లిలో వివరాలు నమోదు చేస్తూ...

**దరఖాస్తు చేసుకోండి**

వేమనపల్లి: తెల్లరేషన్‌కార్డు లేని వారికి రుణమాఫీ కానందునా కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శి ధృవీకరించిన ధృవీకరణ పత్రంతో పాటు ఎటువంటి కొట్టివేతలు లేకుండా నీల్వాయి రైతువేదిక కార్యాలయానికి వచ్చి అందజేయాలని తెలిపారు.

# కవ్వాల్ రోడ్డుకు మోక్షమెప్పుడో..!

- గుంతలమయమైన తారు రోడ్డు
- ఏళ్లుగా వాహనదారులకు ఇబ్బందులు
- నిధులు మంజూరైనా ప్రారంభించని పనులు



చర్లపల్లి వద్ద గుంతల రోడ్డుపై బురద

జన్నారం: బీటీ రోడ్డు చెడిపోయి అధ్వానంగా ఉంది. ఏళ్లుగా గుంతల రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిధులు మంజూరైనట్లు చెబుతున్నా, పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**రోడ్డంతా గుంతలే...**

జన్నారం మండల కేంద్రంలోని కవ్వాల్ గ్రామం వరకు సుమారుగా 10కి.మీ దూరం గత దశాబ్ద కాలం క్రితం బీటీ రోడ్డు నిర్మించారు. కవ్వాల్, కామన్‌పల్లి, దేవునిగూడ, కిష్టాపూర్, బంగారుతాండా, హాస్టల్ తాండా గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రోడ్డు గుండా రాకపోకలు కొనసాగిస్తుంటారు. అవసరాల కోసం జన్నారంకు వస్తుంటారు. అయితే నాలుగు సంవత్సరాల క్రితం రోడ్డుపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి, గుంతలు కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని గుంతల రోడ్డుకు మరమ్మతు చేయాలని వేడుకుంటున్నారు.

**నిధులు మంజూరుపై కానరాని క్లారిటీ..**

కవ్వాల్‌కు వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.50కోట్లు నిధులు మంజూరైనట్లు ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. కానీ ఈ విషయంపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు. పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి క్లారిటీ లేదని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. తీవ్రమైన సమస్య ఉన్న రోడ్డు నిర్మాణంపై అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని దృష్టి పెట్టకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి బీటీ రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ వివరణకు ప్రయత్నించగా ఫోన్ ఎత్తలేదు.

**ఆటో నడపలేకపోతున్నాం**



రోజంతా ఆటో నడుపుకుంటేనే మా కుటుంబం పోషణ గడుస్తుంది. కవ్వాల్ నుంచి జన్నారం వరకు పది కిలోమీటర్ల దూరం ఉంది. అందులో 8 కిమీ రోడ్డంతా చెడిపోయింది. గుంతలు పడి, చెడిపోయిన రోడ్డుపై ప్రయాణించడం ఇబ్బందిగా మారుతుంది. రోడ్డు వెంట ఆటో నడుపలేకపోతున్నాం. ఎమ్మెల్యే పట్టించుకొని రోడ్డు పనులకు నిధులు వచ్చేలా చూడాలి.

- నర్సయ్య, ఆటో యజమాని, కవ్వాల్

# ఉత్తమ తహసీల్దార్ అవార్డు గ్రహీతకు సన్మానం

జన్నారం: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ తహసీల్దార్ అవార్డు అందుకున్న జన్నారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డిని బుధవారం జన్నారం గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు ఘనంగా సన్మానించారు. గ్రామంలో అభివృద్ధి పనుల పరిశీలనకు వెళ్లిన ఆయన్ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ప్రజా సేవ చేసిన వారికి ప్రజల్లో గుర్తింపు వస్తుందని, తహసీల్దార్ సేవలు గుర్తించి అవార్డు అందజేయడం హర్షనీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజోద్దీన్, మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్, నాయకులు నందు నాయక్, అజార్, రవి, తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న జన్నారం గ్రామస్తులు

## సంక్షిప్త వార్తలు

**మహిళలకు అవగాహన**

చెన్నూర్‌రూరల్: మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఆదేశాల మేరకు మండలంలోని కిష్టంపేట గ్రామంలో బుధవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళల హక్కులు, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మహిళ సాధికారిక హబ్ జెండర్ ఫైనాన్షియల్ లిటరసీ లిప్సిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఉచిత కుట్టు శిక్షణ శిబిరం**

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కైలసగిరి కాలనీలో ఎస్సీ, బీసీ, ఎస్టీ, ఓసీ, మైనారిటీలకు చెందిన మహిళలకు గౌతం రాజేశ్వరి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకురాలు సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 2024 సెప్టెంబర్ 5లోపు సున్నంబట్టి ఓవర్ బ్రిడ్జి ప్రక్కన, కైలసగిరి కాలనీలోని దీప్తి బోటిక్ సెంటర్‌లో వివరాల కోసం 99895 27152 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

**స్టడీ మెటీరియల్ అందజేత**

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 15మంది పేద విద్యార్థులకు, హైదరాబాద్‌కు చెందిన బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ వారు స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందించారు. స్టడీ మెటీరియల్‌తో పాటు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు.

**స్టీల్ ప్లేట్ల పంపిణీ**

నస్పూర్: పట్టణ పరిధిలోని విలేజ్ నస్పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా రెడ్డి మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 150మంది విద్యార్థులకు బుధవారం స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు.

**విద్యార్థులకు గొడుగుల పంపిణీ**

మందమర్రిరూరల్: పట్టణంలోని విద్యానగర్‌లో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు బుధవారం గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అజీమొద్దీన్, రాజ్‌కుమార్, సంజీవ్, జావీద్‌పాష, శంకర్ తదితరులు ఉన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో ఇటీవల ఇల్లు దగ్ధం అయింది. కాగా బాధిత కుటుంబాన్ని బుధవారం చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ పరామర్శించి ఓదార్చారు. వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ జెడ్పీవైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, సత్యనారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.